సాక్షి రంగారెడ్డి

ఆదివారం । 23 । జూన్ । 2024



విస్తృతంగా ఎక్సైజ్ దాడులు

ఆమనగల్లు ఎక్సైజ్ ఠాణా పరిధిలో శనివారం ఎక్సైజ్ సీఐ బద్యానాద్‌చౌహాన్ ఆధ్వర్యంలో దాడులు చేశారు. 8లో



రేషన్ బియ్యం పట్టివేత

అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్న ఘటన శనివారం మండలంలోని పుల్లప్పగూడలో చోటు చేసుకుంది. 8లో



అనాథ పిల్లలను చదివిస్తాం

అనాథ పిల్లల చదువు పూర్తయ్యేంత వరకు ఖర్చులను భరిస్తానని జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ అన్నారు. 8లో

న్యూస్‌రీల్

వైద్యాధికారిణికి మెమో



పీహెచ్‌సీలో డాక్టర్ వాణిని విచారిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్

సాక్షి ఎఫెక్ట్..

మొయినాబాద్: గెజిటెడ్ సంతకానికి డబ్బులు తీసుకున్న మండల వైద్యాధికారిణిపై చర్యలకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. మొయినాబాద్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి వాణి గెజిటెడ్ సంతకానికి రూ.500 తీసుకోవడంపై 'తీసుకుంటే తప్పేంటి' అనే శీర్షికతో శనివారం 'సాక్షి' దిన పత్రికలో ప్రచురితమైన వార్తకు ఉన్నతాధికారులు స్పందించారు. శనివారం చేవెళ్ల డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్, సీహెచ్‌ఓ గోపాలరెడ్డి మొయినాబాద్ పీహెచ్‌సీకి వచ్చారు. వైద్యాధికారి వాణి పనితీరు, వ్యవహార శైలిపై వైద్య సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వైద్యాధికారి వాణికి మెమో ఇచ్చారు. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలన్నారు. విచారణ జరిపి పూర్తి వివరాలను జిల్లా అధికారులకు నివేదిస్తామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్ తెలిపారు.

సేవాలాల్ సేన కోకన్వీనర్‌గా గోవర్ధన్‌నాయక్

కందుకూరు: సేవాలాల్ సేన రాష్ట్ర కో– కన్వీనర్‌గా మండలంలోని సార్లరావులపల్లికి చెందిన గోవర్ధన్‌నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు సేవాలాల్ సేన వ్యవస్థాపక, జాతీయ అధ్యక్షుడు భుక్యా సంజీవ్‌నాయక్ శనివారం నియామకపత్రం అందజేశారు. గోవర్ధన్‌నాయక్ మాట్లాడుతూ.. గిరిజనుల హక్కుల కోసం నిరంతరం పోరాడతానన్నారు. తనపై నమ్మకంతో పదవి కట్టబెట్టిన సంజీవ్‌నాయక్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా ఉపాధ్యక్షుడిగా కోట్యానాయక్

కడ్తాల్: సేవాలాల్ సేన జిల్లా ఉపాధ్యక్షుడిగా, కడ్తాల్ మండలం రేఖ్యాతండా పంచాయతీ పరిధిలోని టాకోరాణిగూడ తండాకు చెందిన కోట్యానాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు సేవాలాల్ సేన వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు భుక్యా సంజీవ్‌నాయక్ దేశాల మీదుగా నియామక పత్రం అందుకున్నారు.

తక్కువ ఖర్చుతోనే కీమోథెరపీ

నిమ్స్‌లో అందుబాటులోకి హెచ్‌పీఈసీ యంత్రం

సాక్షి, సిటీబ్యూరో: సామాన్య ప్రజలకు సైతం తక్కువ ఖర్చుతో అత్యాధునిక వైద్య సేవలు అందించే దిశగా నిమ్స్ ఆస్పత్రి ముందుకుసాగుతోంది. సర్జికల్ అంకాలజీ విభాగాధిపతి డా.రాజశేఖర్ శాంతప్ప ఆధ్వర్యంలో శనివారం నిమ్స్‌లో హెచ్‌పీఈసీ యంత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన హైపర్ థెర్మిక్ ఇంట్రా పెరిటోనియల్ కీమోథెరపీ (హెచ్‌పీఈసీ) యంత్రం నిమ్స్ ఆస్పత్రి సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో రూ.6 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు ఖర్చయ్యే ఈ చికిత్స నిమ్స్‌లో రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షల్లోనే లభిస్తుందన్నారు. ఇది ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ పరిధిలోకి వస్తుందని ఆయన తెలిపారు. క్యాన్సర్ బాధితులకు తక్కువ ఖర్చుతో మెరుగైన చికిత్స అందించేందుకు ఇది సరైన అవకాశం అని పేర్కొన్నారు. పొత్తికడుపు క్యాన్సర్, అండాశయ క్యాన్సర్ చికిత్సల్లో గణనీయమైన ఫలితాలు ఇస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీరప్ప, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గం చెరువు వద్ద మత్తు పదార్థాల స్వాధీనం

మాదాపూర్: మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుర్గం చెరువు డ్వాక్రా కాలనీ వద్ద శనివారం నార్కొటిక్ డ్రగ్స్‌ను కలిగివున్న ఐదుగురిని అరెస్టు చేశారు. విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు డ్వాక్రా కాలనీలో సెల్లార్‌కు చెందిన వెంకట సాయిదరణ్ అనే యువకుడు 12.72 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను విక్రయించడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. డ్రగ్స్‌తోపాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై గతంలోనూ కేసులున్నాయని పోలీసులు తెలిపారు. బెంగళూరు కేంద్రంగా నిందితుడు వెంకటసాయి చరణ్..మరికొందరితో కలిసి వివిధ నగరాలు, పట్టణాలకు డ్రగ్స్ రవాణా చేస్తున్నాడని తెలిపారు. డ్రగ్స్ రవాణా చేయడానికి భిన్నమైన విధానాలను అనుసరిస్తూ వెల్లడించారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల డ్రైవర్లకు రూ.100 ఇచ్చి వారికి తెలియకుండానే ఓ చిన్నకవర్లో డ్రగ్స్ పెట్టి వివిధ పట్టణాలకు సరఫరా చేస్తున్నాడని తెలిపారు. ఇలా మార్నింగ్ స్టార్ ట్రావెల్స్, రాజేశ్వరి ట్రావెల్స్, జీవీఆర్ ట్రావెల్స్, చెర్రీ ట్రావెల్స్ ద్వారా హైదరాబాద్‌కు డ్రగ్స్ రవాణా చేసినట్టు గుర్తించారు. ఈ విషయమై అన్ని ట్రావెల్స్ ఏజెన్సీలకు నోటీసులు అందజేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మహేశ్వరంలోనే ఏఐ సిటీ!

200 ఎకరాల్లో విస్తరణకు సన్నాహాలు

- ఇప్పటికే స్థల గుర్తింపు..
- త్వరలోనే ప్రభుత్వ ప్రకటన
- ఫార్మాసిటీ భూముల్లో జపాన్ పెట్టుబడులు
- 1,000 ఎకరాల్లో ఎలక్ట్రానిక్ సంస్థల ఏర్పాటుకు సంప్రదింపులు

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సిటీని మహేశ్వరంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏఐ టెక్నాలజీకి మంచి భవిష్యత్ ఉన్న నేపథ్యంలో ఈ సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సిటీని అభివృద్ధి పరిచే దిశగా ఆలోచన చేస్తోంది. సైబరాబాద్ ఐటీ హబ్ ప్రాంతంలో స్థలాల కొరత, ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకొని ఏఐ సిటీని మహేశ్వరంలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర సర్కారు ప్రాథమికంగా నిర్ణయించింది. అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్‌రోడ్డు, జాతీయ రహదారి, ఎంఎంటీఎస్ అందుబాటులో ఉండటంతో పాటు.. విరివిగా ప్రభుత్వ భూములు లభ్యత ఉన్నందున.. మహేశ్వరం నియోజకవర్గం వైపు మొగ్గు చూపుతోంది. దీనికితోడు మెట్రో రైలు కూడా ఈ ప్రాంతానికి పొడిగించే ఆలోచన చేస్తున్నందున ఏఐ సిటీ నిపుణుల రాకపోకలకు ఇబ్బందులు ఉండవని అంచనా వేస్తోంది. వచ్చే నెలలో నగర వేదికగా నిర్వహించే ఏఐ సదస్సులో ప్రభుత్వం అధికారికంగా ఏఐ సిటీని ప్రకటించే అవకాశం ఉంది.

మరో మహా నగరం ఆవిష్కృతం

- మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల పరిధిలో ఫార్మాసిటీని ఏర్పాటు చేయాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం భావించింది. ఆ మేరకు యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాల పరిధిలోని పది గ్రామాల్లో 19,330 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించింది. ఇప్పటికే 14,000 ఎకరాలు స్వాధీనం చేసుకుంది. ఈ ఫార్మా సిటీని రద్దు చేస్తున్నట్లు గతంలో ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వీటి స్థానే ఫార్మా విలేజీలు, ఇతర సంస్థలను ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టం చేసింది. ఇందులో భాగంగా తాజాగా 200 ఎకరాల్లో ఈ భూముల్లో ఏఐ సిటీని ప్రతిపాదిస్తోంది.
- జపాన్‌కు సంబంధించిన సంస్థ ఈ సిటీ ఏర్పాటుకు ముందుకు వచ్చినట్టు అధికార వర్గాల ద్వారా తెలిసింది. కుర్మిద్ద, మీర్‌ఖాన్‌పేట ప్రాంతాల్లో ఈ సిటీని ఏర్పాటు చేసే అంశంపై ఇటీవల టీజీఐఐసీ యంత్రాంగం.. స్థానిక ప్రజాప్రతినిధులతో సంప్రదింపులు కూడా జరిపింది. అయితే, గతంలో ఫార్మాసిటీని రద్దు చేసి.. నిర్వాసితులకు భూములను వెనక్కి ఇస్తామని అధికార పార్టీ ప్రకటించింది. తాజాగా ఫార్మా స్థానే ఇతర కంపెనీలకు భూములు కేటాయిస్తే.. రైతుల నుంచి వ్యతిరేకత ఉంటుందనే సమాచారంతో సంస్థల పెట్టుబడులపై గోప్యతను పాటిస్తోంది.



ఇండోనేషియా కూడా..

మరోవైపు ఇండోనేషియాకు చెందిన సంస్థ కూడా ఇక్కడ పెట్టుబడులు పెట్టే దిశగా ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోంది. మొబైల్ తయారీ యూనిట్లను ఇక్కడ నెలకొల్పే అంశాన్ని పరిశీలిస్తున్న సంస్థ.. అనువైన భూముల అన్వేషిస్తోంది. ఈ సంస్థకు కూడా ఫార్మాసిటీలోనే దాదాపు వేయి ఎకరాలు కేటాయించే అవకాశం లేకపోలేదు.



అజీజ్‌నగర్‌లో జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

నా గెలుపు మోదీదే

- చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- అజీజ్‌నగర్‌లో బీజేపీ జెండా ఆవిష్కరణ, సన్మాన సభ

మొయినాబాద్ రూరల్: నరేంద్ర మోదీని చూసి నాకు ఓటేసి గెలిపించిన ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని.. ఈ గెలుపు మోదీదే అని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామంలో జెండా ఆవిష్కరణకు ఆవిష్కరించి ఆయనకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జెండా ఆవిష్కరణ అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పది స్థానాల్లో పోగా వేసేందుకు పని చేసినా ఎనిమిది స్థానాల్లో గెలిచామన్నారు. తాండూరు నుంచి మహేశ్వరం నియోజకవర్గం వరకు రెండు మండలాలు తప్ప అన్ని నియోజకవర్గాల్లోని మండలాలలో బీజేపీ ఆధిక్యత కనబరిచిందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ముఖ్యమంత్రి ఉండటం ఖాయమన్నారు. ఇందుకు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే ప్రజల్లో ఉండాలన్నారు. ప్రజా సమస్యలపై గలమెత్తుతూ వాటి పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అధిక నిధులు తీసుకువచ్చేందుకు కృషిగా చేస్తానన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ స్థాయి నుంచి వార్డు సభ్యులు, సర్పంచులను గెలిపించుకుంటూనే వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు మనం పట్టుదలతో ముందుకు వెళ్లాలన్నారు. మాదాపురి ప్రధాని అయిన మోదీకి అభినందనలు తెలుపుదామని సూచించారు. మండలంలో బీజేపీ పార్టీకి ఐదు వేల మెజార్టీ ఇవ్వడాని ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డిగూడ జ్ఞానేశ్వర్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి తూర్పు మాధవరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు తూర్పు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రాజుగౌడ్, అశోక్ యాదవ్, శ్రీకాంత్, మహేందర్, మహిళా బీజేపీ ఎస్సీ కమిటీ గ్రామ అధ్యక్షురాలు లిల్లీ, గోపాల్‌రెడ్డి, అశ్విని, జనార్దన్‌రెడ్డి, మల్లారెడ్డి, శ్రావణ్, నవీన్‌రెడ్డి, మల్లేశ్, సుధాకర్, సురేశ్, వివిధ గ్రామాల నాయకులు, బీజేపీ సభ్యులు పాల్గొన్నారు.

హత్య చేసి.. పూడ్చిపెట్టి

వివాహేతర సంబంధం ఓ మహిళ ప్రాణాన్ని పొట్టన పెట్టుకుంది. తనతో పాటు ఇతరులతోనూ చనువుగా ఉంటోందనే అనుమానంతో ప్రియుడే ఆమెను హత్య చేసి, పూడ్చిపెట్టాడు. మూడు నెలల క్రితం అదృశ్యం కేసు నమోదవ్వగా.. దర్యాప్తు చేపట్టిన పోలీసులు శనివారం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.



పాతిపెట్టిన మహిళ శవాన్ని బయటకు తీయిస్తున్న పోలీసులు

- మహిళ ప్రాణం తీసిన వివాహేతర సంబంధం
- చంపేసి.. పూడ్చి పెట్టిన ప్రియుడు
- మూడు నెలల క్రితం అదృశ్యం.. అస్తిపంజరమై లభ్యం

షాబాద్: అదృశ్యమైన మహిళ.. హత్యకు గురైన సంఘటన షాబాద్ పీఎస్ పరిధిలో వెలుగుచూసింది. మృతురాలి బంధువులు, పోలీసుల వివరాల ప్రకారం.. షాబాద్‌కు చెందిన తొంట సంతోష(30) ఏప్రిల్ 7నుంచి కనిపించకుండా పోయింది. ఈ విషయమై ఆమె కుమారుడు సంతోష్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదైంది. కేసు విచారణలో భాగంగా సదరు మహిళ ఫరూఖ్‌నగర్ మండలం హాజిపల్లికి చెందిన సద్దుల సత్తయ్య అనే వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నట్లు తెలిసింది. ఆతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు తమదైన శైలిలో విచారించగా అసలు విషయం బయటపడింది.

అనుమానంతోనే హత్య

షాబాద్ మండలం బోనగిరిపల్లి సమీపంలో ఉన్న కొల్లబోరాల్ వెంచర్‌లో నిందితుడు సత్తయ్య రెండు నెలల పాటు (మార్చి, ఏప్రిల్) వాచ్‌మెన్‌గా పనిచేశాడు. భర్త చనిపోయిన సంతోషతో.. పెళ్లికాని ఇతనికి కొన్నేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగుతోంది. ఇటీవల వీరిమధ్య మనస్పర్థలు రావడంతో సంతోష ప్రియుడిని దూరం పెట్టింది. దీంతో ఆమె ఇతరులతో చనువుగా ఉంటోందని సత్తయ్య అనుమానం పెంచుకున్నాడు. ఈక్రమంలో సంతోషను అంతం చేయాలని నిర్ణయించుకున్నాడు. మార్చి 28న రాత్రి 8గంటల సమయంలో సత్తయ్య వెంచర్‌లో నైట్ డ్యూటీ చేస్తుండగా మృతురాలు అక్కడకు వెళ్లింది. ఈ సమయంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. నువ్వు ఇతరులతో చనువుగా ఉంటూ నన్ను పట్టించుకోవడం లేదని



తొంట సంతోష (ఫైల్)

ఆగ్రహానికి గురైన నిందితుడు ఆమెపై కర్రతో దాడి చేశాడు. తల, శరీర భాగాలపై గాయాలవ్వడంతో కిందపడిపోయింది. దెబ్బలు తాళలేక చనిపోయిందని నిర్ధారించుకున్న అనంతరం వెంచర్ పక్కనే ఉన్న వరద కాల్వలో గుంత తీసి పాతిపెట్టాడు. మరుసటి రోజు నుంచి అక్కడ డ్యూటీ మానేశాడు.

ఘటనా స్థలంలోనే శవ పంచనామా

నిందితుడు చెప్పిన వివరాల మేరకు అడిషనల్ డీజీపీ విజయ్‌కుమార్, షాబాద్ ఇన్‌స్పెక్టర్ అస్వర్ ఆధ్వర్యంలో శనివారం సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, ఉస్మానియా వైద్యులు శవాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం హతురాలి అస్థిపంజరాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పోలీసులు పట్టించుకోలేదు

నిందితుడిని పట్టుకోవడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని మృతురాలి బంధువులు ఆరోపించారు. సంతోష మిస్సింగ్ విషయమై పలుమార్లు స్టేషన్‌కు వెళ్లి మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని తెలిపారు. సత్తయ్యపై తమకు అనుమానం ఉందని చెప్పినా నేడు, రేపు అంటూ కాలయాపన చేశారని వాపోయారు. పోలీసులు వెంటనే స్పందించి ఉంటే కనీసం ఆమె చివరి చూపునైనా చూసుకునేవారమని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈము రుణాల మాఫీ ప్రకటన హర్షణీయం

ఈము రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి

షాద్‌నగర్: ఈము రైతులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను మాఫీ చేస్తామని మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటన చేయడంపై ఈము రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయానికి అనుబంధంగా లాభసాటిగా ఉంటుందని ఈము పక్షుల పెంపకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించి నాబార్డు సహకారంతో సబ్సిడీ ఇచ్చి 15 ఏళ్ల క్రితం బ్యాంకుల ద్వారా రైతులకు రుణాలు ఇప్పించారన్నారు. ఆశించిన స్థాయిలో మార్కెట్ లేక రైతులు అప్పుల పాలై ఇబ్బందులు పడుతున్నారని, ఇద్దరు రైతులు ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. బ్యాంకుల వారు రైతుల ఆస్తులను వేలం వేసిన సందర్భాలు సైతం ఉన్నాయని వివరించారు. ఈము రైతులను ఆదుకోవాలని గతంలో ఎన్నో సార్లు అధికారులు, ప్రభుత్వాన్ని వేడుకున్నా ఫలితం లేదని వాపోయారు. ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో రైతులను రుణ విముక్తులను చేసేందుకు మార్గం చూపాలని మంత్రులు అధికారులను ఆదేశించారు. త్వరలో ఈము రైతుల రుణాలను మాఫీ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రులు ప్రకటించడం హర్షణీయమన్నారు.

వీధి కుక్కల వీరంగం



మహిళ వెంటపడి తరిమిన శునకాలు

- మణికొండ చిత్రపురి కాలనీలో ఘటన



మహిళ వెంట పడిన కుక్కలు (ఇన్‌సెట్‌లో) బాధితురాలు రాజేశ్వరి

మణికొండ: వాకింగ్ కోసం ఇంట్లోంచి బయటకు వచ్చిన ఓ మహిళను వీధి కుక్కలు వెంటపడి తరిమాయి. ఏకంగా పదికి పైగా కుక్కల గుంపు ఆమెను చుట్టుముట్టి భయభ్రాంతులకు గురిచేశాయి. కుక్కల బారి నుంచి తప్పించుకుంటూ ఆ మహిళ వంద అడుగుల దూరం వరకు వెళ్లింది. అయినా అవి వెంటపడి మరో తరమడంతో మహిళ అదుపుతప్పి కింద పడిపోయింది. దీంతో అవి ఒక్కసారిగా ఆమెపై పడ్డాయి. అదే సమయంలో అటువైపు స్కూటీపై వస్తున్న వ్యక్తి వద్దకు సదరు మహిళ పాపోయింది. కుక్కల బారి నుంచి తప్పించుకున్న ఘటన మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురి కాలనీలో శనివారం చోటు చేసుకుంది.



కుక్కలను తప్పించుకునే క్రమంలో కింద పడిన మహిళ

బాధితురాలి కథనం ప్రకారం.. చిత్రపురి కాలనీకి చెందిన రాజేశ్వరి రోజు మాదిరిగానే శనివారం ఉదయం 6 గంటలకు వాకింగ్ నిమిత్తం ఇంట్లోంచి బయటకు వచ్చింది. అదే సమయంలో పదుల సంఖ్యలో ఉన్న కుక్కలు ఒక్కసారిగా ఆమె వెంట పడ్డాయి. వాటి నుంచి తప్పించుకునేందుకు ఆమె విశ్వ ప్రయత్నాలు చేసింది. దాంతో వాటి కాటుకు బలి కాకుండా తప్పించుకోగలిగింది.

తిండి కోసం ఎదురుచూస్తుండగా..

కాలనీ వాసులు ముందు రోజు మిగిలిపోయిన ఆహారాన్ని కుక్కల కోసం వీధుల్లో పెడుతున్నారు. దీంతో ప్రతిరోజూ ఉదయం కుక్కలు ఆకలితో అక్కడే వేచివుంటున్నాయి. శనివారం కుక్కల బారిన పడిన మహిళ సైతం తమకు ఆహారం పెట్టేందుకే వచ్చి ఉంటుందని కొద్ది సేపు వెంటపడినట్లు సీసీ టీవీలలో రికార్డు అయ్యింది. ఎంతకూ అన్నం పెట్టకపోయేసరికి మహిళ వెంట పడ్డాయని కాలనీ వాసులు భావిస్తున్నారు.

ఫోన్ మాట్లాడుతూ బస్సు నడిపితే చర్యలు

- స్కూల్ బస్సుల డ్రైవర్లకు జేటీసీ రమేష్ హెచ్చరిక



సాక్షి, సిటీబ్యూరో: మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతూ బస్సు నడిపినా, ర్యాష్ డ్రైవింగ్ చేసినా కఠిన చర్యలు తప్పవని రవాణాశాఖ హైదరాబాద్ జేటీసీ రమేష్ స్కూల్ బస్సు డ్రైవర్లను హెచ్చరించారు. పిల్లలను పాఠశాలకు తీసుకెళ్లి, తిరిగి ఇళ్ల వద్దకు చేర్చే వరకు ప్రతి క్షణం ఎంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శనివారం ఖైరతాబాద్ ఆర్టీఏలో నిర్వహించిన స్కూల్ బస్ డ్రైవర్ల సమావేశంలో ఆయన పలు సూచనలు, సలహాలు, హెచ్చరికలతో భద్రతా పాఠాలను బోధించారు. రహదారి భద్రతా నిబంధనలను ఉల్లంఘించే వాహనాలను నడిపితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. బస్సులను ఎప్పటికప్పుడు కండిషన్‌లో ఉంచుకోవాలని, డ్రైవర్లు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా బస్సులను నడపాలని చెప్పారు. "మీ పట్ల ఎంతో నమ్మకంతో తల్లిదండ్రులు తమ పిల్లలను బస్సెక్కిస్తున్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయొద్దు. జాగ్రత్తగా బస్సులు నడపండి. చిన్నారులను క్షేమంగా ఇళ్లకు చేర్చండి" అని చెప్పారు. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 200 మంది డ్రైవర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఫిట్‌నెస్ లేని బస్సులపై ఇటీవల ప్రత్యేక తనిఖీలు చేపట్టిన ఆర్టీఏ అధికారులు తాజాగా డ్రైవర్ల పనితీరుపై దృష్టి సారించారు. ప్రతి బస్సులో తప్పనిసరిగా అటెండర్లు ఉండాలని, పిల్లలు బస్సెక్కే, దిగే సమయాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో ప్రాంతీయ రవాణా అధికారులు పురుషోత్తం రెడ్డి, సీపీ వెంకటేశ్వర్లు, సీనియర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.



ఫారిన్ కిక్కే వేరయా!

ధర ఎక్కువైనా వెనక్కి తగ్గని మద్యంప్రియులు

- ఒకప్పుడు విదేశాలు, గోవా నుంచి తెప్పించుకోవాల్సిందే..
- ప్రస్తుతం సిటీలో విదేశీ మద్యానికి పెరుగుతున్న డిమాండ్

సాక్షి, సిటీబ్యూరో: ఫారిన్ లిక్కర్ అంటే మద్యం ప్రియులకు ఎంతో మక్కువ. ఎవరైనా ఫారిన్ నుంచి వస్తుంటే చాలా వరకు పోస్లు, చాక్లెట్లు, బ్రాండెడ్ దుస్తులు తీసుకు రమ్మంటారు. కానీ మద్యం ప్రియులు మాత్రం ఫారిన్ సరుకు ఒక బాటిల్ అయినా తీసుకురమ్మని విదేశాల నుంచి వచ్చే వారిని కోరుతుంటారు. అది ఫారిన్ మందుకున్న క్రేజ్. ఇక్కడ ఎన్ని బ్రాండ్లు దొరికినా కూడా ఫారిన్ మందుకున్న డిమాండ్ అలాంటిది. ఎంత ధర అయినా సరే ఒక్కసారైనా విదేశీ మద్యం రుచి చూడాలని తాపత్రయపడుతుంటారు. ఒకప్పుడు నగరంలో ఫారిన్ లిక్కర్ లభించేది కాదు. కొన్నేళ్ల క్రితం వరకు గోవా నుంచి మాత్రమే తెప్పించుకునేవారు. లేదంటే అక్కడికి వెళ్లి పర్మిషన్ ఉన్న స్థాయిలో ఇక్కడికి తీసుకొచ్చుకొని అప్పుడో పెగ్.. ఇప్పుడో పెగ్ కొడుతుండేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. ఎంచక్కా అలా వైన్స్ షాప్ వెళ్లి.. ఇలా ఫారిన్ సరుకు తెచ్చుకునే వెసులుబాటు లభించింది.

బాప్‌రే ఎన్ని రకాలో..

టీఎస్‌బీసీఎల్ కార్పొరేషన్ ద్వారా రాష్ట్రంలో దేశీ మద్యంతో పాటు విదేశీ మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. చాలా రకాల విదేశీ మద్యం అందుబాటులో ఉంది. గరిష్టంగా 750 ఎం.ఎల్ విదేశీ మద్యం రూ.70 వేల దాకా ఉంది. విస్కీ, ఎంత పాతది అయితే అంత ఎక్కువ ధర ఉంటుంది. 26 ఏళ్ల గ్లెన్‌ఫిడ్ సింగిల్ మాల్ట్ స్కాచ్ విస్కీ 700 ఎం.ఎల్ ధర రూ.62,200 ఉంది.



ఏటా 2.5 లక్షల కేసులు

హైదరాబాద్‌లో ఏటా 2.5 లక్షల కేసుల విదేశీ మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. దీని విలువ దాదాపు రూ.800 కోట్ల వరకు ఉంది. ఇక ఫారిన్ బీర్లకు కూడా కాస్త డిమాండ్ ఈ మధ్య పెరుగుతోంది. ఏటా 5,500 నుంచి 6 వేల కేసుల బీర్లు అమ్ముడవుతున్నాయి. రూ.5 కోట్ల విలువైన బీర్లు విక్రయిస్తున్నారు. ఎక్కువగా ఎండాకాలంలో దేశీయ బీర్ల కొరత ఏర్పడినప్పుడు వినియోగదారులు విదేశీ బీర్ల వైపు మొగ్గు చూపుతున్నారు. విస్కీ, స్కాచ్ ఇంగ్లండ్, స్కాట్‌లాండ్ నుంచి ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్నారు. వోడ్కా మాత్రం రష్యా నుంచి వస్తోంది.

పాఠశాల గోడ దూకబోయి..

ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి విద్యార్థికి తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న విద్యార్థి

షాద్‌నగర్‌రూరల్: పాఠశాల గోడ దూకేందుకు యత్నించిన విద్యార్థి ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి తీవ్రగాయాల పాలయ్యాయి. ఈ ఘటన పట్టణంలోని మేథా ఇంటర్నేషనల్ పాఠశాలలో శనివారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. పట్టణంలోని ఆఫీసర్స్ కాలనీలో నివాసం ఉంటున్న అక్రం తన కుమారుడు ఆర్మాన్(9)ను కొన్ని రోజుల క్రితం పట్టణంలోని మేథా ఇంటర్నేషనల్ పాఠశాలలో 5వ తరగతిలో చేర్పించాడు. అక్కడే పాఠశాల ఆవరణలో హాస్టల్ ఉంటూ అక్కడే చదువుకుంటున్నాడు. ఎప్పటిలాగే తరగతికి వెళ్లిన ఆర్మాన్ వాష్ రూంకని చెప్పి హాస్టల్ వైపు వెళ్లాడు. హాస్టల్ వెనుక నుంచి గోడ దూకేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో గోడ పక్కనే ఉన్న కంచె లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడిపోయాడు. దీంతో విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన ఉపాధ్యాయులు పాఠశాల యాజమాన్యానికి తెలిపారు. విషయాన్ని తెలుసుకున్న విద్యార్థి కుటుంబ సభ్యులు పాఠశాలకు చేరుకొని బాలుడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంతోనే..

విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు అక్కడికి చేరుకొని, ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కంచె లేకపోవడంతోనే విద్యార్థి ప్రమాదానికి గురయ్యాడని ఆరోపించారు. పాఠశాల సమయంలో విద్యార్థులు ఎక్కడికి వెళ్తున్నారు.. ఎందుకు వెళ్తున్నారనే విషయాన్ని ఎవరు పట్టించుకోకపోవడంతో ప్రమాదం జరిగిందన్నారు. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంతోనే విద్యార్థి ఆర్మాన్ ప్రమాదం బారిన పడ్డాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

బెల్ట్ షాపులపై దాడులు ముగ్గురి అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులు, బార్లపై హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడులు చేశారు. బంజారాహిల్స్, బోరబండ, చిక్కడపల్లి పోలీసు స్టేషన్ల పరిధిలో ఆకస్మిక దాడులు చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి రూ.1.06 లక్షల విలువైన 48 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బంజారాహిల్స్‌లోని ఇందిరానగర్‌లో చిట్లూరి శ్రీనివాస్, బోరబండకు చెందిన వీ నర్సింహా, రామాంతపూర్‌కు చెందిన ఎం మల్లేష్‌లు స్థానిక వైన్స్‌ల్లో మద్యాన్ని కొనుగోలు చేసి, అర్ధరాత్రి సమయంలో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు.

విస్తృతంగా ఎక్సైజ్ దాడులు



బెల్లంపానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

6 కేసులు నమోదు.. బెల్లం పానకం ధ్వంసం

ఆమనగల్లు: ఆమనగల్లు ఎక్సైజ్‌పోలీసు స్టేషన్ పరిధిలోని తలకొండపల్లి, కడ్తాల మండలాల్లోని పలు గ్రామాలు, గిరిజన తండాల్లో శనివారం ఎక్సైజ్ సీఐ బద్యానాద్‌చౌహన్ ఆధ్వర్యంలో విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆరు కేసులను నమోదు చేసి పలుచోట్ల బెల్లంపానకం ధ్వంసం చేశారు. తలకొండపల్లి మండలం తుమ్మలకుంటతండా, హర్యనాయక్‌తండా, లక్ష్మీతండా, చీపునుంతల, చుక్కాపూర్, కడ్తాల మండలం సలార్‌పూర్ తండాల్లో ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా పలు చోట్ల నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. తలకొండపల్లి మండలంలో నాలుగు కేసులు, కడ్తాల మండలంలో రెండు కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో డీటీఎఫ్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐ స్వప్న, హెడ్ కానిస్టేబుల్ శంకర్, కానిస్టేబుల్ దశరథ్, ఆమనగల్లు, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం పోలీస్‌స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా తయారు చేస్తే చర్యలు

నాటుసారాను తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాద్‌చౌహాన్ హెచ్చరించారు. తలకొండపల్లి మండలంలోని పలు తండాలు, గ్రామాల్లో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ..ప్రభుత్వం నాటుసారాపై ఉక్కుపాదం మోపిందని, సారా తయారు చేసినా, విక్రయించినా చట్టప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. నల్ల బెల్లం, పటిక, నవసాగరం తదితర సారా తయారీకి వినియోగించే వాటిని విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. నాటుసారా తయారు చేసినట్లు తెలిస్తే ఎక్సైజ్ శాఖకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అనాథ పిల్లలకు అండగా ఉంటా

- జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్
- తల్లిదండ్రులు లేని బాలికకు స్కూల్‌లో ప్రవేశం



చిట్టితో జెడ్పీటీసీ వెంకటేశ్, తదితరులు

తలకొండపల్లి: తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలను చదివించి వారు ఉన్నత చదువులు చదివేంత వరకు ఖర్చులను భరిస్తానని ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. మండల పరిధిలోని పాతకోట తండాకు చెందిన చిట్టి తల్లిదండ్రులు చనిపోయారు. దీంతో చిట్టి తాత సంరక్షణలో 5వ తరగతి వరకు చదివింది. వయస్సు పైబడటంతో చిట్టిని ఆమె తాత చదివించలేకపోతున్నాడు. తండావాసులు ఈ విషయాన్ని జెడ్పీటీసీ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన ఆయన చిట్టిని కార్పొరేట్ పాఠశాలల్లో చదివిస్తానని భరోసా ఇచ్చారు. ప్రజ్ఞ స్కూల్ యజమాన్యంతో మాట్లాడి శనివారం 6వ తరగతిలో చేర్పించారు.



రోడ్డు పక్కన పడేసిన బ్యాగులు

బ్యాగుల కలకలం

మొయినాబాద్: హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి పక్కన కత్తిరించిన బ్యాగులు కలకలం రేపాయి. మండలంలోని అజీజ్‌నగర్ పాత చౌరస్తా సమీపంలో రోడ్డు పక్కన ఉన్న ఖాళీస్థలంలో గుర్తుతెలియని వ్యక్తులు టూరిజం బ్యాగులు కత్తిరించి పడేశారు. శనివారం స్థానికులు, రోడ్డు వెంట వెళ్లేవారు వాటిని చూచి, ఎందుకు పడేశారు..? ఎక్కడి నుంచి తెచ్చారు..? అనే సందేహం నెలకొంది. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా తమ దృష్టికి రాలేదని చెప్పారు.

అన్న మరణాన్ని తట్టుకోలేక..

- గుండెపోటుతో చెల్లి మృతి
- గంటల వ్యవధిలోనే ఇద్దరి మరణం
- నాగారంలో విషాద ఛాయలు



విఠలాచారి (ఫైల్)



వజ్రాల అనిత (ఫైల్)

మహేశ్వరం: తనతో ఎంతో ప్రేమగా ఉండే అన్న ఇక లేడని తెలిసి ఆ చెల్లి తట్టుకొలేకపోయింది. గుండెలవిసేలా రోదించి.. హార్ట్ ఎటాక్‌తో కన్నుమూసింది. మహేశ్వరం మండల పరిధిలోని నాగారంలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కమ్మరి విఠలాచారి(50), వజ్రాల అనిత (46), అన్నాచెల్లెలు. గ్రామంలో నివాసం ఉంటూ వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు.. అన్న విఠలాచారి ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లాలో భూమిని కొనుగోలు చేసి వ్యవసాయం చేస్తున్నాడు. ఇదిలా ఉండగా రోజులాగే శనివారం తెల్లవారుజామున పొలానికి వెళ్లిన విఠలాచారి అక్కడే ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న అనిత ఏడ్చిఏడ్చి వేసారిపోయింది. ఒక్కసారిగా గుండెనొప్పితో బాధపడుతూ కుప్పకూలింది. చుట్టుపక్కల వారు వచ్చి పరిశీలించగా అప్పటికే మృతిచెందింది. విఠలాచారికి భార్య, ముగ్గురు పిల్లలు ఉండగా.. అనితకు ఇద్దరు పిల్లలు సంతానం. గంటల వ్యవధిలో అన్నాచెల్లెలు మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇదిలా ఉండగా విఠలాచారి ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

రేషన్ బియ్యం పట్టివేత



పుల్లప్పగూడలో పట్టుబడిన రేషన్ బియ్యం

కొందుర్గు: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్న ఘటన శనివారం మండలంలోని పుల్లప్పగూడలో చోటు చేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాజుశివకుమార్ ఇంట్లో రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు అందిన సమాచారం మేరకు శనివారం కొందుర్గు పోలీసులు రాజు ఇంట్లో సోదా చేశారు. దాదాపు 7 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై రాజును విచారణ కోరగా గ్రామాల్లో రేషన్‌కార్డుల లబ్ధిదారుల నుంచి బియ్యం కొనుగోలు చేసి పరిశ్రమల్లో పని చేసే కార్మికులకు విక్రయిస్తుంటామని చెప్పారు. ఇందులో భాగంగానే బియ్యం నిల్వ ఉంచినట్లు వివరించారు. ఈ సందర్భంగా రేషన్ బియ్యంతో పాటు నిందితుడు రాజును పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య పేర్కొన్నారు.